వైఎస్ఆర్ కడప వార్త
తెలుగు జాతీయ దినపత్రిక
గురువారం 26 మార్చి 2026



## అన్న క్యాంటీన్‌లో భోజనం చేసిన కమిషనర్..

**కడప కార్పొరేషన్ మార్చి 25 ప్రభాతవార్త:**

కడప నగరపాలక సంస్థ కమిషనర్ కూచిపూడి రాకేష్ చంద్ర కడప జెడ్పీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. క్యాంటీన్ లో అందిస్తున్న భోజనాన్ని స్వయంగా తీసుకుని, అక్కడికి వచ్చిన సామాన్య ప్రజలతో కలిసి భోజనం చేశారు. ఆహార పదార్థాల నాణ్యత, వంట విధానం, పరిశుభ్రత ప్రమాణాలు, క్యాంటీన్‌లో అమలు చేస్తున్న నిర్వహణ వ్యవస్థను క్షుణ్ణంగా పరిశీలించారు. భోజనంలో ఉపయోగిస్తున్న పదార్థాల తాజాదనం, రుచితనం, పోషక విలువలపై సంబంధిత సిబ్బందిని ప్రశ్నించారు. అదేవిధంగా క్యాంటీన్‌కు వచ్చే లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. భోజన ధరలు, వసతులు, క్యూలైన్ నిర్వహణ, తాగునీటి సదుపాయాలు ఏర్పాట్లు వంటి అంశాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు.



## ఢిల్లీలో వైసిపి కార్యాలయంలో ఎంపీ పూజలు

**రాజంపేట, మార్చి 25 ప్రభాతవార్త**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి దేశ రాజధాని ఢిల్లీ పార్లమెంట్ భవన్ లో కేటాయించిన కార్యాలయంలో పార్టీ ఎంపీలు పూజలు నిర్వహించారు. బుధవారం రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, రాజంపేట ఎంపీ మేడా రఘునాథరెడ్డి, మరో రాజ్యసభ సభ్యుడు వైవి సుబ్బారెడ్డి , తదితరులు పూజల్లో పాల్గొన్నారు. వైసిపికి నూతన పార్లమెంట్ కోణంలో మంచి కార్యాలయం కేటాయించారని ఎంపీ మేడా రఘునాథరెడ్డి తెలిపారు.



# బ్రహ్మోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

### బ్రహ్మోత్సవాల నిర్వహణ భద్రతపై దిశా నిర్దేశితం.. కడప జిల్లా ఎస్పీ సచ్కేత్ విశ్వనాథ్





**ఒంటిమిట్ట మార్చి.24. (ప్రభాతవార్త )**

టీటీడీ ఆధ్వర్యంలో ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా ఈనెల 27వ తేదీ నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు నిర్వహిస్తున్న నేపథ్యంలో పోలీసు భద్రత ఏర్పాట్లపై బుధవారం కడప జిల్లా ఎస్పీ సచికేత్ విశ్వనాథ్ పోలీసులకు దిశా నిర్దేశం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన ఒంటిమిట్టకు రావడం జరిగింది. ముందుగా ఆయన టిటిడి జెఈఓ వీరబ్రహ్మం, తన పోలీసు బలగాలతో కలిసి కోదండ రామస్వామి ఆలయంలోకి వెళ్లి స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి ఆలయ పరిసరాలను, ఆలయాన్ని ,కళ్యాణ వేదిక,, హెలి ఫ్యాట్ , క్యూలైన్లు, ప్రసాద వితరణ కేంద్రాన్ని పరిశీలించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలకు వస్తున్న భక్తులకు పోలీసు భద్రత అత్యంత ప్రధానమన్నారు. పోలీసు బలగాలు ముమ్మరంగా కృషి చేయాలన్నారు. భద్రత బలగాల దృష్ట్యా రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్నాథ్ హెగ్డేకు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. బ్రహ్మోత్సవాల సమయంలో సీతారామ కళ్యాణం సమయంలో ట్రాఫిక్కుకు ఎటువంటి అంతరాయం లేకుండా భక్తులు సంచరించేందుకు సౌకర్యవంతంగా ఉండేందుకు పూర్తి ప్రణాళిక బద్ధంగా వాహనాల మళ్లింపు విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఇందు నిమిత్తం వాహన నిలుపుదల ప్రదేశాలు, రహదారి మార్గాలు ,విఐపి వాహన నిలుపుదల ప్రదేశాలను క్రమబద్ధంగా అత్యంత జాగ్రత్తగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. బ్రహ్మోత్సవాలకు విఐపి, మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతున్న నేపథ్యంలో భద్రతను పటిష్టం చేయాలన్నారు. ఏప్రిల్ 01వ తేదీ టిటిడి ఆధ్వర్యంలో నిర్వహించే సీతారామ కళ్యాణోత్సవ వేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రి దంపతులు హాజరవుతున్నట్లు కావున పోలీసు భద్రత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పూర్తి నియమ నిబద్ధతతో విస్తృత తనిఖీలు నిర్వహించి ఎటువంటి లోటుపాట్లు లేకుండా సీతారామ కళ్యాణోత్సవాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని జగదభి రాముని కీర్తి ప్రతిష్టలను నలు దిశలా వ్యాపింపచేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని స్వామి కృపాకటాక్షాలతో బ్రహ్మోత్సవాలను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీకృష్ణ, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహరాజు, ఒంటిమిట్ట సిద్ధవటం ఎస్ఐలు శ్రీనివాసులు, హారిక ఇతర పోలీసు సిబ్బంది, టిటిడి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఆధునిక సంకేతికతతో పారదర్శకత, వేగం,

# విశ్వసనీయత పెరుగుతాయ్

**కడప, మార్చి 25 ప్రభాతవార్త:**

జనగణన గృహ సర్వేలో ఆధునిక సాఫ్ట్‌వేర్ వ్యవస్థల వినియోగంతో పారదర్శకత, వేగం, విశ్వసనీయత పెరుగుతాయని జిల్లా గణన అధికారి విశ్వేశ్వర నాయుడు తెలిపారు.బుధవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో భారత సెన్సస్-2027 జనగణన కార్యక్రమంకు సంబంధించి నిర్వహణకు సంబంధించి.. మూడవ స్థాయి శిక్షణలో భాగంగా ఫీల్డ్ ట్రైనర్లకు మూడవ రోజు ముగింపు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి డీఆర్ఓ విశ్వేశ్వర నాయుడు ముఖ్య అతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 2027 జనాభా గణనను సమగ్రంగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 1 నుండి 30 వరకు నిర్వహించనున్న జిల్లాలో జరగనున్న సర్వే కి సంబంధించి ఫీల్డ్ ట్రైనర్స్ కు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 2027 జనాభా గణన రెండు దశల్లో జరుగుతుందని తెలిపారు. మొదటి దశలో ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణన మరియు రెండవ దశలో జనాభా గణన నిర్వహించబడుతుందన్నారు. రెండవ దశలో కుల గణన కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. మొదటి దశను మే 1 నుంచి మే 30 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కడప జిల్లాకు సంబంధించిన మొత్తం 98 మంది ఫీల్డ్ ట్రైనర్లు ఈ శిక్షణలో పాల్గొంటున్నారన్నారు. వీరు శిక్షణ పూర్తిచేసుకున్న అనంతరం, ఏప్రిల్ నెలలో మండల స్థాయిలో ఎన్యుమరేటర్లు మరియు సూపర్వైజర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. కాగా మాస్టర్ ట్రైనర్లు ప్రొఫెసర్లు శ్రీనివాసులు, సుదర్శన్ రెడ్డి, ఆదిలక్ష్మి, ఫీల్డ్ ట్రైనర్లకు శిక్షణ అందించారు.మూడవ రోజు శిక్షణలో భాగంగా కడప కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతంలోని సచివాలయాల పరిధిలో 60 ఇళ్లలో యాప్ ద్వారా సర్వే డేటా సేకరణ చేపట్టే విధానాన్ని.. ఫీల్డు ట్రైనర్లకు క్షుణ్ణంగా వివరిస్తూ... డేటా సేకరణ చేపట్టారు. కాగా మాస్టర్ ట్రైనర్లు ప్రొఫెసర్లు శ్రీనివాసులు, సుదర్శన్ రెడ్డి, ఆదిలక్ష్మి, ఫీల్డ్ ట్రైనర్లకు శిక్షణ అందించారు.ఈ దశలో ఇంటి నిర్మాణానికి ఉపయోగించిన మెటీరియల్, ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, త్రాగునీటి సౌకర్యం, మురుగునీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంటగది సౌకర్యం, అలాగే రేడియో, టెలివిజన్, స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్, సైకిల్, కారు తదితర సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 33 ప్రశ్నల వివరాలను ఎన్యుమరేటర్ ప్రతి ఇంటికి వెళ్లి సేకరించే విధానాన్ని వివరించనున్నట్లు తెలిపారు. అలాగే, ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్లైన్లో నమోదు చేసుకొనే విధముగా ప్రత్యేక పోర్టల్ 15 రోజులు ముందుగానే అందుబాటులో వుంటుందన్నారు.సాంకేతిక ఆధారిత డేటా సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డిజిటల్ సాంకేతికతల్లో సమాచార సేకరణ, డేటా ఎంట్రీలో ఖచ్చితత్వం, ఫీల్డ్ స్థాయి ధృవీకరణ ప్రక్రియలు వంటి వాటికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ఆధునిక సాఫ్ట్‌వేర్ వ్యవస్థల వినియోగంతో పారదర్శకత, వేగం, విశ్వసనీయత పెరుగుతాయని నిపుణులు వివరించారు.ఈ కార్యక్రమంలో కేఎంసి కమిషనర్ రాకేష్ చంద్రం, జిల్లా జనగణన ఇన్‌చార్జ్ మోహన్ రమణ, డిప్యూటీ కలెక్టర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# రాయలసీమలో మాత్రమే నాణ్యత అరటి పండ్లు





**కడప కార్పొరేషన్ మార్చ్ 25 ప్రభాతవార్త:**

దేశంలో ఎక్కడా లేనివిధంగా రాయలసీమలో మాత్రమే నాణ్యతతో కూడిన అరటి పండ్లు పండుతున్నాయని కానీ ఆరుగాలం కష్టపడి పండించిన రైతన్నలకు మద్దతు ధర లభించడం లేదని, అరటి రైతులు నష్టపోతున్నారని, అందుకే అరటి రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నానని ఏపీ సిసి చీఫ్ వైఎస్.షర్మిల అన్నారు. కడప పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ షర్మిల బుధవారం కడప కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి కడప కలెక్టరేట్ వరకు అరటిపండ్ల లోడ్ తో ఉన్న వాహనాన్ని స్వయంగా నడిపారు. అరటి రైతులను ఆదుకోవాలని కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. అనంతరం విలేకరులతో వైయస్ షర్మిలా మాట్లాడుతూ గిట్టుబాటు ధర లేక అరటి రైతులు పడుతున్న ఆవేదన ప్రపంచానికి తెలియాలని , ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ఎండగట్టాలని, స్వయంగా నేనే అరటి గెలలతో కూడిన రవాణా వాహనాన్ని నడుపుకుంటూ కడప జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లానని వెల్లడించారు. రైతుకి జరిగిన నష్టంలో సర్కారు నిరక్ష్యమా లేక యుద్ధ ప్రభావమా, మరోపక్క వ్యాపారుల మాయాజాలమా అని కాలయాపన చేయకుండా తక్షణం అరటి రైతులను ఆదుకోవాలని, ప్రభుత్వమే అరటిపండ్లను కొని సంక్షేమ పాఠశాలలకు మిడ్ డే మీల్స్ పథకంలో మరింత పౌష్టిక ఆహారంగా బిడ్డలకు ఇవ్వాలని, అరటి గెలలను స్టోరేజి చేసుకునే విధంగా జిల్లాలో వెంటనే శీతల గిడ్డంగులను తెరవాలని కోరారు. కోల్డ్ స్టోరేజీ విషయంలో నేను ప్రశ్నించింది ప్రభుత్వాన్ని మాత్రమే.. నా వ్యాఖ్యలను వైసిపి సైతాన్ సైన్యం వక్రీకరించిందన్నారు. 2023 లో పులివెందుల లో కోల్డ్ స్టోరేజి ప్రారంభించా అని జగన్ చెప్పింది పచ్చి అబద్ధం అన్నారు. ఎన్నికలకు ముందు హడావిడిగా కోల్డ్ స్టోరేజీ కి రిబ్బన్ కట్ చేశారనీ, మార్చ్ 11, 2024 న జగన్ బనానా ఇంటిగ్రేటెడ్ ప్లాంట్ ప్రారంభించడం ఎన్నికల కోసం చేసిన స్టంట్ మాత్రమే అని విమర్శించారు. మేము కేవలం మాజీ ముఖ్యమంత్రి జగన్ నిరక్ష్యం అని మాత్రమే అన్నాను.. నా టార్గెట్ జగన్ మోహన్ రెడ్డి కాదనీ ప్రభుత్వాన్ని మాత్రమే ప్రశ్నిస్తున్నానని స్పష్టం చేశారు. అరటి రైతుల కోసం మేము చేస్తున్న పోరాటానికి మద్దతు పలకాలి కానీ కోడిగుడ్డు మీద ఈకలు పీకుతారా అని వైసిపి నాయకులను ప్రశ్నించారు. మొన్న విజయమ్మ లేక మీద వైసీపీ

2వ పేజీలో

# 25 బస్తాల బియ్యం స్వాధీనం



**దువ్వూరు, మార్చి 25, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని జొన్నవరం క్రాస్ వద్ద కడపకర్నూల్ జాతీయ రహదారిపై 25 బస్తాల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ధనుంజయుడు తెలిపారు. వాహనాల తనిఖీలలో భాగంగా జొన్నవరం మెట్ట వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా దువ్వూరు వైపు నుండి ఆళ్లగడ్డకు బొలెరో వాహనంలో రవాణా అవుతున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. బస్తాలను లెక్కించగా 25 బస్తాలు ఉన్నాయని ఒక్కొక్క బస్తా 30 కేజీల నుండి 40 కేజీల వరకు ఉంటుందని తెలిపారు. దీనికి సంబంధించిన వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఎమ్మెల్యే కృషితో కోర్టు అభివృద్ధికి నిధులు

**ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 25 ప్రభాతవార్త**

పట్టణంలోని జిల్లా అదనపు న్యాయస్థానంలో అసంపూర్తిగా ఉన్న కోర్టుల నిర్మాణం కొరకు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి కృషితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 5 కోట్ల 70 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసిన నేపథ్యంలో బుధవారం స్థానిక నెహ్రూ రోడ్డు లోని టిడిపి కార్యాలయంలో ప్రొద్దుటూరు న్యాయవాదుల అధ్యక్షులు రామచంద్రారెడ్డి, సెక్రెటరీ చంద్రశేఖర్, న్యాయవాదులు ఇవి సుధాకర్ రెడ్డి, గొర్రె శ్రీనివాసులు, రాజేష్ రెడ్డి, పరమేష్, మురళి, రమేష్ తదితరులు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ముందుగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రొద్దుటూరు లో 2004లో జిల్లా అదనపు కోర్టు మంజూరైందని తెలిపారు. ప్రస్తుతం వున్న న్యాయస్థానాలతో పాటు మరో 2 న్యాయస్థానాలు కూడా మంజూరైనాయని వివరించారు. క్వార్టర్స్ కూడా త్వరలో కోర్టులో నిర్మించనున్నామని తెలిపారు. అనంతరం న్యాయవాది ఈ.వి. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని జిల్లా అదనపు కోర్టు కు ఎమ్మెల్యే ముఖ్యమంత్రి ద్వారా 5,70,000 రూపాయల నిధులు మంజూరు చేయించారని, ఈ నిధులతో ప్రొద్దుటూరు న్యాయస్థానాలలో గత 10 సంవత్సరాలిగా అసంపూర్తిగా ఉన్నటువంటి నిర్మాణం అనగా కోర్టు భవనాలు, రోడ్లు, లిఫ్ట్, న్యాయవాదుల అసోసియేషన్ ఆఫీసు, మహిళా న్యాయవాదులకు ప్రత్యేక ఆఫీసు ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయవచ్చని వివరించారు. గతంలో కూడా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి చొరవతోనే ఈ జిల్లా అదనపు కోర్టు ఏర్పాటై, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, తదితర ప్రాంతాల ప్రజలు కడపకు వెళ్లే వ్యయప్రయాసలు తగ్గాయని వివరించారు. ఆ విషయంలోనూ, ప్రస్తుతం నిధుల మంజూరు విషయంలోనూ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కి తాము రుణపడి వుంటామని తెలిపారు. మరో న్యాయవాది గొర్రె శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రొద్దుటూరు లోని జిల్లా అదనపు కోర్టులో పనిచేసే న్యాయమూర్తులు కోర్టు ప్రాంగణంలో నివాస వసతి లేని కారణంగా బయటి ప్రాంతాల్లో నివసిస్తున్నారని, కావున న్యాయవాదుల క్వార్టర్స్ కూడా ఎమ్మెల్యే ఏర్పాటు చేయించాలని కోరారు.



### నేడే ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారి

# బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

### బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఏకశిలా నగరి



ఒంటిమిట్ట రామాలయం దక్షిణ వైపు విద్యుత్ అలంకరణ

**రాజంపేట, మార్చి 25 ప్రభాతవార్త**

ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ ఆలయం పురాతన, చారిత్రక ప్రాశస్త్యం కలిగినది. ఒకే శిలపై శ్రీ సీతారామ లక్ష్మణుల విగ్రహాలు ప్రతిష్టితమై ఉండటంతో ఒంటిమిట్టను "ఏకశిలా నగరం"గా కూడా పిలుస్తారు.మార్చి 26 నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం మూలవిరాట్టులకు వ్యాసాభిషేకం, ఆరాధన, అర్చనలు నిర్వహిస్తారు.సాయంత్రం 6 గంటల నుండి అర్చకుల వేదమంత్రోచ్ఛారణల మధ్య అంకురార్పణ శాస్త్రోక్తంగా జరుగుతుంది. ఇందులో భాగంగా శ్రీ సీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి విష్వక్సేన పూజ, కలశ ప్రతిష్ట, కలశ పూజ, వాసుదేవ పుణ్యాహవచనం, కంకణధారణ నిర్వహిస్తారు. అనంతరం పుట్టమన్ను సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మార్చి 27వ తేదీన శుక్రవారం ధ్వజారోహణంతో శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 నుండి 10.15 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం జరుగనుంది.అదే రోజు ఉదయం 11 గంటలకు శ్రీరామనవమి ఆస్థానం, సాయంత్రం 4 గంటలకు శ్రీ పోతన జయంతి, కవిసమ్మేళనం నిర్వహించనున్నారు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు శేష వాహనసేవపై స్వామి, అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

శ్రీరామ పుష్కరిణి



# రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేస్తాం

### సబ్ కలెక్టర్, అధికారులతో జగన్మోహన్ రాజు భేటీ



రైల్వే అండర్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న జగన్మోహన్రాజు



సబ్ కలెక్టర్ భావన,అధికారులు, బాధితులతో సమావేశమైన చమర్తి

**రాజంపేట, మార్చి 25 ప్రభాతవార్త**

రాజంపేట రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం పనులను అందరికీ ఆమోదయోగ్యంగా, ఎవరికి అన్యాయం జరగకుండా, పూర్తిచేసి సమస్యలు పరిష్కరిస్తామని రాజంపేట తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ జగన్మోహన్రాజు పేర్కొన్నారు. ఈ మేరకు రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్ ఎస్ భావన ,రైల్వే ,రెవెన్యూ ,ఆర్ అండ్ బి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అంతకు ముందు పార్టీ నాయకులు, ప్రజలు, బాధితులతోకలిసి అసంపూర్తి ఆర్ యు బి ని ఆయన పరిశీలించారు. అనంతరం రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు.రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణంపై సమగ్ర చర్చ నిర్వహించారు.అభివృద్ధితో పాటు అందరికి మంచి చేసేలా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ రాజంపేటకు రైల్వే అండర్ బ్రిడ్జి ఎంతో ముఖ్యమని,అలాగే నష్టపోయే బాధితులను ఆదుకోవడం కూడా తమకు చాలా ముఖ్యమని,కాబట్టి నష్టపోయే ఇలా యజమానులకు నష్టపరిహారం అందిస్తూనే దుకాణదారులకు మున్సిపల్ పరిధిలోని స్థలాలలో ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణంతో పాటు అందరికీ న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ భావన మాట్లాడుతూ వెంటనే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కావలసిన ఎస్టిమేట్లు,అలాగే నష్టపోయే వారి జాబితాను తయారుచేసి వారికి అందించే నష్టపరిహారం వివరాలను,విధి విధానాలను తయారుచేసి నివేదికను అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ప్రతాప్ రాజు, రాజంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు, తాసిల్దార్, సర్వేయర్, ఆర్ అండ్ బి అధికారులు, మున్సిపల్ అధికారులు, ఆర్ యు బి సాధన సమితి నాయకుడు రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు సర్వర్ కష్టాలు

**పెండ్లిమర్రి, మార్చి 24, ప్రభాతవార్త:**

మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు సర్వర్ కష్టాలు మొదలయ్యాయి. బుధవారం కొత్త సంగటిపల్లెలో ఉపాధి కూలీలకు మండుతున్న ఎండలో సిబ్బంది ఐరీస్ తీసుకునేందుకు సర్వర్ పనిచేయక పోవడంతో కూలీలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మండే ఎండలో పని చేసినా సర్వర్ పని చేయకపోవడంతో తమకు మస్టర్ పడుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. సర్వర్ పనిచేసేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఏపీవో ఓబులమ్మను వివరణ కోరగా ఏపీమొత్తం సర్వర్ సమస్య ఉందని ప్రభాతవార్తకు వివరణ ఇచ్చారు.

## బాధ్యతల స్వీకరించిన నళిని

ముద్దనూరు,మార్చి 25, ప్రభాతవార్త :



మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం నాడు చిత్తూరు జిల్లా డిఆర్‌ఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న పి, నళిని నీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పదోన్నతిపై ముద్దనూరు సబ్ రిజిస్ట్రార్‌గా విధులు చేపట్టినట్లు తెలిపారు. రిజిస్టర్ కార్యాలయంలో పెండింగ్లో ఉన్న క్రయ,విక్రయాలను త్వరగా పరిష్కరించి మండల రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయలో ఏ విధమైన సేవలకైనా కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలని బయట దళారులను నమ్మవద్దని సూచించారు.

## పదవ తరగతి పరీక్ష కేంద్రాల పరిశీలన



ముద్దనూరు,మార్చి 25, ప్రభాతవార్త:

మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని బాలుర బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో పదవ తరగతి పరీక్షా కేంద్రాలను బుధవారం నాడు సిఐ నగేష్ బాబు పరిశీలించారు. విద్యార్థులకు పరీక్ష సమయంలో ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా విద్యార్థులకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎరీక్షా కేంద్రాల పరిసరాలలో బయటి వ్యక్తులు రాకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

## నీటి వృధాను అరికట్టాలి : ఎంపీపీ

చాపాడు. మార్చి25. ప్రభాతవార్త :




రానున్నది వేసవికాలం కావడంతో గ్రామాలలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో నీటి వృధాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షుడు టి లక్ష్మయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ సభా భవనం నందు బుధవారం త్రాగునీటి భద్రత, ప్రజల భాగస్వామ్యం అనే అంశంపై సర్పంచులు,ఎంపీటీసీలు, వార్డు మెంబర్లకు పరిపాలనాధికారి రామానుజం ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా భూగర్భ జలాలు ఇంకిపోవడంతో ప్రజలు నీటి ఇబ్బందులు ఎదుర్కోకుండా తాగునీటి భద్రత ప్రజల భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రత్నరాజు, ట్రైనర్లు సురేష్ బాబు, చంద్రశేఖర్, మాస్టర్ ట్రైనర్ సుబ్బరాయుడు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మఠాధిపతుల చేతుల మీదుగా మాలధారణ



బ్రహ్మంగారిమఠం మార్చి 25 ప్రభాతవార్త

జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠంలోని మహానివేదిన మందిరంలో బుధవారం మఠాధిపతులు శ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాముల వారి చేతుల మీదుగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మాల వస్త్రాలు, పూజా సామాగ్రి అందించడం జరిగింది. అనంతరం స్వామివారు వారికి మంత్రోచ్చారణ మధ్య భక్తులకు మాలా ధారణ మెడలో వేశారు.మాల ధారణ వేసుకున్న స్వాములందరూ కూడా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మూలమంత్రాన్ని అనునిత్యం జపిస్తూ ఉండాలని మరియు మాలాధారణకు సంబంధించిన నియమ నిష్టల గురించి స్వామి వారు తెలియజేశారు.ఈ మాలా, వస్త్రాలు, పూజా సామాగ్రి కోనేటి వీర నాగరాజు, పసుపులేటి వెంకటసుబ్బయ్యలు ఉచితంగా అందించారు.

## హోటళ్లపై విజిలెన్స్ అధికారులు దాడి



బ్రహ్మంగారిమఠం మార్చి 25 ప్రభాతవార్త

బ్రహ్మంగారిమఠంలోని విజిలెన్స్ అధికారులు హోటల్ పై మెరుపు దాడులు నిర్వహించారు. మూడు హోటల్లోని సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇంట్లో వాడవలసిన గ్యాస్ సిలిండర్లను వ్యాపార సముదాయానికి వాడుతున్నారనే సమాచారం తెలియడంతో ఈ తనిఖీలు చేసామన్నారు.ఈ గ్యాస్ సిలిండర్ల వాడకంపై పూర్తిగా అవగాహన లేని మాపై అకస్మాత్తుగా దాడులు చేయడం చాలా దారుణమని హోటల్ యజమానులు వాపోతున్నారు.ఈ సందర్భంగా విజిలెన్స్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ ఇంట్లో వాడవలసిన సిలిండర్లను వ్యాపార సముదాయాలలో వాడుకూడదని, వాటిని కమర్షియల్ గానే వాడాలని ఆయన చెప్పారు. అలా వాడని యెడల చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

## అంకాలమ్మ తల్లికి వెండి ముఖ కవచం

పులివెందుల,మార్చి 25 , ప్రభాత వార్త :

పులివెందుల పట్టణంలోని శ్రీ అంకాలమ్మ అమ్మవారి ఆలయంలో స్థానికంగా రెడ్డెమ్మ పెయింట్ షాప్ నిర్వహిస్తున్న భక్తుడు యస్. బాలు అమ్మవారిపై ఉన్న విశేష భక్తితో సుమారు రూ.5 లక్షల విలువ గల కిలోన్నర వెండి ముఖ కవచాన్ని సమర్పించారు.వెండి ముఖ కవచాన్ని ఆలయానికి శోభాయాత్రగా తీసుకువచ్చి, అర్చకులు సురేష్ బాబు ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నూతన వెండి ముఖ కవచాన్ని ధరింపజేయగా, ఆ దృశ్యాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతూ భక్తి వాతావరణం నెలకొంది.అనంతరం ఆలయ మాజీ చైర్మన్ బ్యాటరీల ప్రసాద్, ఏవో రమణలు దాత యస్. బాలను శాలువాతో సత్కరించి అభినందించారు. ఆలయ అభివృద్ధికి భక్తుల సహకారం అవసరమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



# రాయలసీమలో మాత్రమే నాణ్యత అరటి పండ్లు



చేసింది అనవసరమైన రాదంతం అని అన్నారు. విజయమ్మ లేఖ సుప్రీమ్ కోర్ట్ తీర్పు తో సమాన మనీ చెప్పారు. నేను వైసీపీ నేతలను కుక్కలు అనలేదనీ కూడా వివరించారు. విజయమ్మ మాట్లాడొద్దు అంటే మాట్లాడుతున్నారు. అంటే మొరగడం కుక్కల నైజం అనుకోవాలి అని మాత్రమే అన్నాననీ వివరణ ఇచ్చారు. మీ జోలికి నేను..నా జోలికి వస్తే అఫెన్సివ్ గేమ్ ఆడటం నాకు తెలుసనీ చెప్పారు. దేశంలో అరటి పండ్లుక్వాలిటీతో పండేది రాయలసీమలోనే.. అందుకే మన అరటి గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతుందనీ చెప్పారు. యుద్ధం వలన డిమాండ్ లేదనీ, కానీ ధర లేదు అనేది పార్ట్ ప్రాబ్లం మాత్రమే అని అన్నారు. ప్రతి ఏడాది మార్చ్ లో ధరలు ఇలాగే పతనం అవుతున్నాయను పేర్కొన్నారు. ఫిబ్రవరి వరకు టన్నుకు రూ.26 వేల ధర పలికిందనీ, ఇప్పుడు టన్నుకు రూ.4 వేలకు మించి లేదని అందుకే అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కడప జిల్లాలో కోల్డ్ స్టోరేజీ వ్యవస్థ లేక రైతులకు కష్టాలు పడుతున్నారని బాధను వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటను పొలాల్లోనే వదిలేస్తున్నారు.. ప్రాసెసింగ్ ప్లాంట్ అందుబాటులోకి వచ్చి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదనీ చెప్పారు. రైతులకు మార్కెటింగ్ సపోర్ట్ లేదని, ధర లేనప్పుడు రైతులకు ఎక్కడ అమ్మాలో కూడా తెలియని పరిస్థితి అని చెప్పరు. బనానా మార్కెట్ పై రైతులకు అవగాహన కల్పించడం లేదని మండిపడ్డారు. రైతుల కష్టాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కొనుగోలు చేసి మిడ్ డే మిల్స్‌కి సప్లై చేయాలని సలహా ఇచ్చారు. అరటి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

## పదోన్నతి పొందిన నాగార్జునకు సత్కారం

కలసపాడు, మార్చి 25 ప్రభాతవార్త:

కలసపాడు పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ కె.ఎ. నాగార్జున ఇటీవల అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా బుధవారం కలసపాడు పోలీస్ స్టేషన్‌లో సన్మానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలసపాడు ఎస్సై ఎం. సుభాన్, స్టేషన్ సిబ్బంది సహచరులు కలిసి నాగార్జునని అభినందించి, శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరిం చారు. ఆయన సేవలను ప్రశంసిస్తూ, విధి నిర్వహణలో ఆయన చూపిన కృషి, నిబద్ధత వలన ఈ పదోన్నతి సాధ్యమైందని తెలిపారు. అధికారులు మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా ఇలాగే ప్రజలకు సేవ చేస్తూ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహనాలు తనిఖీ

ప్రొద్దుటూరు క్రైం, మార్చి 24, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు పట్టణంలో తరుచుగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపైట్రాఫిక్ పోలీసులు కొరఢా ఝుళిపించారు. నిబంధనలు గాలికి వదిలేసి రోడ్లపై ఇష్టారాజ్యంగా ప్రయాణిస్తూ తోటి వారికి ఇబ్బందులు కలిగిస్తున్న వారి విషయంలో మరింత కఠినంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ ఆదేశాల మేరకు రోడ్డు సేఫ్టీలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు నిర్వహిస్తున్న డ్రైవ్‌లో భాగంగారోడ్లపై తనిఖీలుముమ్మరం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారు తనిఖీల్లో పట్టుబడితే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు జైలు శిక్ష సైతం పడేలా సాక్ష్యాధారాల కోర్టుల్లో నిరూపించేలా కృషి చేస్తున్నారు. పదే పదే పట్టుబడే వారిపై లైసెన్సులు సైతం రద్దు చేసేలా సంబంధిత అధికారులకు సిఫార్సు చేస్తున్నారు.

## పులివెందులలో త్రైత సిద్ధాంత
## తెలుగు యుగాది క్యాలెండర్ ఆవిష్కరణ



పులివెందుల, మార్చి 25, ప్రభాత వార్త :

పులివెందుల పట్టణంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సరానికి సంబంధించిన త్రైత సిద్ధాంత తెలుగు యుగాది క్యాలెండర్ (త్రైతశకం-48) ను బుధవారం ఘనంగా ఆవిష్కరించారు.స్థానిక టీడీ పీ ఎమ్మెల్సీ కార్యాలయంలో నిర్వహించిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో డీఎస్పీ మురళీ నాయక్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి పాల్గొని క్యాలెండర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా విడుదల చేసిన త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్లను పులివెందుల టౌన్ సీఐ శ్రీరాములు, ఎస్సై తిమోతి, శ్రీకృష్ణ మందిరం వ్యవస్థాపక సభ్యుడు ధరణి రమణ, అగ్నిమాపక శాఖ, సబ్ జైలు సిబ్బంది, యాక్సిస్ బ్యాంకు సిబ్బంది, వైయస్ మధుసూదన్ రెడ్డి, వైయస్ మనోహర్ రెడ్డి తదితరులకు పంపిణీ చేశారు. మండల రెవెన్యూ కార్యాలయ సిబ్బందికీ క్యాలెండర్లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఈ కాలసూచికలో భగవద్గీత శ్లోకాల సారాంశాన్ని సరళమైన తెలుగులో అందించి ప్రతి ఒక్కరికీ సులభంగా అర్థమయ్యేలా రూపొందించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పులివెందుల కమిటీ అధ్యక్షుడు డి. వరుణ్ కుమార్‌తో పాటు మహేశ్వర రెడ్డి, గురుమూర్తి, వెంకటయ్య, ఎల్లటూరు నరసింహ, ఆదిలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి



దువ్వూరు, మార్చి 25, ప్రభాతవార్త:

సమాజంలో బాల్య వివాహాలు చేయడం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని అందువల్ల బాల్య వివాహాలను అరికట్టాలని ఎంపీడీవో సుబ్బారెడ్డి, ఐసిడిఎస్ సిడిపిఒ ముంతాజ్ బేగంలు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన దువ్వూరులో కౌమార దశలో గర్భధారణ వాటి వలన దుష్పలితాలు అనే అంశంపై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వలన కౌమర దశలో గర్భధారణ జరుగుతుందని దాని వల్ల అనేక దుష్పలితాలు వస్తాయన్నారు. చిన్న వయసులో గర్భం దాల్చడం వలన తల్లి, శిశువు ఇద్దరికీ ప్రాణాపాయం ఉంటుందని అలాగే పౌష్టికాహార లోపం కూడా ఉంటుందన్నారు. అందువల్ల విద్యకు దూరం కావచ్చు అని పేర్కొన్నారు. అనారోగ్యమైన సమస్యలు వస్తాయని రక్తహీనత, అధిక రక్తపోటు ఉంటుందన్నారు. అందువల్ల బాల్య వివాహాలను అరికట్టి విద్యను ప్రోత్సహించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నెలకొల్పాలి అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ లు వరలక్ష్మి, సౌజన్య, కళావతి పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ కల్యాణ రామ నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

కాశినాయన మార్చ్ 25 ప్రభాతవార్త



కాశినాయన మండలం నాయనపల్లె (హరిజనవాడ) గ్రామంలో శ్రీ కళ్యాణ రామ నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక ఉత్సాహం నడుమ ఘనంగా నిర్వహించబడింది. ఈ పుణ్యకార్యానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి విచ్చేయగా, గ్రామస్తులు పూర్ణకుంభంతో సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, ధ్వజస్తంభంవద్ద కొబ్బరికాయ కొట్టి దేవునికి నమస్కరించడం జరిగింది. ఈ కార్యక్రమం మొత్తం భక్తి పారవశ్యంతో నిండిపోయి, గ్రామం మొత్తం ఒక ఆధ్యాత్మిక క్షేత్రంలా మారింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా, పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఆనందభరితంగా ఆశీర్వాదాలు స్వీకరించారు. ఎమ్మెల్సీ గారిని గ్రామ పెద్దలు, నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించగా, గ్రామ ప్రజలు కూడా హర్షాతిరేకంతో ఆయనకు మర్యాదలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మాట్లాడుతూ, నాయనపల్లె గ్రామంలో సీతారాముల స్వామి దేవాలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి గ్రామస్థుడికి, నాయకులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ దేవాలయం నిర్మాణం కాలనీవాసుల చిరకాల ఆకాంక్ష నెరవేరినట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్సీ కాలనీలో నివసిస్తున్న ప్రజలు తమ ఆధ్యాత్మిక విశ్వాసాన్ని ప్రతిబింబించేలా దేవాలయం నిర్మించుకోవడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. గ్రామస్తుల ఐక్యత, భక్తి, నిబద్ధత వల్లే ఈ మహోత్సవం విజయవంతమైందని అన్నారు. ఇలాంటి పుణ్యకార్యాలు సమాజంలో సానుకూలతను పెంచి, ప్రజల మధ్య ఐక్యతను మరింత బలపరుస్తాయని ఆయన పేర్కొన్నారు. చివరగా సీతారాముల కటాక్షం గ్రామ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండి, వారు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులుబోయిళ్ళ ఓబుల్ రెడ్డి, కోడూరు చిన్న వెంకటరెడ్డి, పాలకొల్లును కృష్ణారెడ్డి, బద్వేల్ జయరాం రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శంకరయ్య, పెద్ద శంకరయ్య, తిరుపాలు, నరసింహారెడ్డి, నరసింహులు, శేఖర్, అంకయ్య, జిల్లా అనుబంధ విభాగాల నాయకులు గాజులపల్లి రవిచంద్ర రెడ్డి, ఎలిచెర్ల నాగ సుబ్బారెడ్డి, బిజీ వేముల పుల్లారెడ్డి, నారాయణరెడ్డి, రుద్రవరం రాము, కేశాలు, గురప్ప పార్టీ నాయకుల తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా శ్రీ సీతాలక్ష్మణ హనుమత్సమేత
# కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

బద్వేలు అర్బన్, మార్చి 25, ప్రభాతవార్త :

బద్వేలు పట్టణ పరిధిలో మార్తోమానగర్ , ఆంజనేయనగర్ నందు నూతనంగా నిర్మించిన శ్రీ కోదండరామస్వామి దేవాలయం బుధవారం నుంచి 27వ తేది శుక్రవారం వరకు శ్రీ సీతాలక్ష్మణ హనుమత్సమేత కోదండ రామస్వామి శిఖర, కలశ, ధ్వజ, కుంబాభిషేక మహోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నుంచి శుక్రవారం 3 రోజుల పాటు దేవస్థానక మిటి సభ్యులు, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో అంగరంగ వైబవంగా ప్రారంభమయ్యాయి. బుదవారం ఉదయం వేదపండితులు బ్రహ్మశ్రీ గానుగపాటి రాజశేఖర్ శర్మ ఆధ్వర్యంలో గణపతి ప్రార్థన , గంగా నయనం, అఖండ దీపారాధన, పంచగవ్య ప్రాసనం మాతృకా పూజ, రక్షా బంధనం, ఋత్విగ్వరణం, యాగశాల ప్రవేశం, కలశ స్థాపన, శోడష మండపపూజ, వాస్తు సర్వతో భద్ర నవగ్రహ, సుదర్శన ఆరాధనతో పాటు పాటు పలురకాల పూజలు నిర్వహించారని ఆలయ కమిటి సభ్యులు ఎస్. వెంకటసుబ్బయ్య, శీలి రమణయ్య,, గిద్దలూరు తిరుపాలయ్య, మెడిమిశివయ్య,శీలి నరసింహులు,దార్ల నరసింహులు, కోరపల్లి చిన్నయ్య, ఉర్లకొండయ్యలు తెలిపారు. అలాగే సాయంత్రం మృత్యుంగ్రహణం, అంకురారోపణం, అగ్ని ప్రతిష్ట, గణపతిహోమం, దీక్షా హోమం, జపప పారాయణం జలాధివాసం, నివేదన మంగళహారం మంత్రపుష్పం, రాత్రి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న వారికి అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

**స్వామివారి పంచలోహ ఉత్సవ విగ్రహాలు వితరణ:**

శ్రీ సీతాలక్ష్మణ హనుమత్సమేత కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవానికి సుమారు లక్షా 50 వేలు విలువ చేసే పంచలోహ విగ్రహాలను 11వ వార్డుకు చెందిన కీ.శే. వేముల వెంకటసుబ్బయ్య, సతీమణి వెంకటలక్షుమ్మ కుమారుడు వేముల సుబ్బరాజు సతీమణి వెంకట సుధ, సౌమ్య, శృతి, అక్షర కుటుంబ సభ్యుల సహకారంతో ప్రత్యేక బ్యాండు మేళతాల మధ్య కమిటి సభ్యులకు అందించారు. సుబ్బరాజ కుటుంబ సభ్యులకు ఆలయ కమిటి సభ్యులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుబ్బరాజా మాట్లాడుతూ మార్తోమానగర్‌లో ఎంతో వైభవంగా నిర్మాణం చేపట్టిన స్వామి వారి ఆలయ నిర్మాణానికి పంచలోహ విగ్రహాలు తమ కుటుంబం తరపున ఇవ్వడం తమకెంతో సంతోషకరమన్నారు. ఈ ప్రాంతంలోని భక్తాదులు స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.





## చంద్రబాబు క్రెడిట్ దోపిడీ చేస్తూనే ఉన్నాడు

వేంపల్లి: మార్చి25 ప్రభాతవార్త

మిట్టల్ స్టీల్ ప్లాంట్ వ్యవహారంలోనూ బాబు క్రెడిట్ చోరీ 2022 దావోస్ పర్యటనలో ఆదిత్య మిట్టల్ నాతో సమావేశమయ్యారు రూ.4,800 కోట్లు గ్రీన్ కో లో పెట్టుబడులు పెట్టారు. ఎస్సార్ స్టీల్ ను కొనుగోలు చేసి..మన హయాంలో వెయ్యి కోట్లు పెట్టుబడి పెట్టారు. కొత్త స్టీల్ ప్లాంట్ పెడతామంటే మేం ఆహ్వానించాం. కాకినాడ, మూలపేట, నక్కపల్లిలో భూములు చూపించాం ఎన్నికలకు ముందు వచ్చి నక్కపల్లిని ఎంపిక చేసుకున్నారు తనను చూసి స్టీల్ ప్లాంట్ వచ్చినట్టుగా బాబు బిల్డప్ గూగుల్ విషయంలోనూ ఇలాగే క్రెడిట్ దోపిడీ చేస్తున్నారు. 2023లో బల్క్ డ్రగ్ పార్క్ తీసుకొచ్చాం ఎక్కువ ల్యాండ్ కావాలని సంక్షోభం సృష్టించారు. దీనివల్ల బల్క్ డ్రగ్ పార్క్ తిరోగమనంలో ఉంది. ఖాన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు నాయుడు పరిపాలన కాపీ పేస్ట్‌లగా ఉందని పేర్కొన్నారు. ఇకనైనా చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చినటువంటి హామీలు నెరవేర్చాలి. లేకుంటే ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడే పరిస్థితి ఎంతైనా ఉంది

## వైస్సార్ ఘాట్ వద్ద షర్మిల నివాళ్లు



వేంపల్లి: మార్చి25 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి వై ఎస్ షర్మిల రెడ్డి ఈ రోజు ఇడుపులపాయలో దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ ఘాట్ వద్ద మహానేత వైఎస్సార్ కు నివాళులు అర్పించారు..బుధవారం ఇడుపులపాయ లో ఆమె జిల్లా కార్యక్రమం లో భాగంగా తండ్రి సమాధి వద్ద ఫోల మాల వేసి నివాళ్లు అర్పించి కాసేపు మౌనం పాటించారు..ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ లు ఇర్ఫాన్ బాషా, ధ్రువకుమార్ రెడ్డి మరియు ఇతర నియోజకవర్గాల ఇంచార్జులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ అధికారుల
## పనితీరు మారకపోతే సరెండర్ చేస్తాం

### రాజంపేట మున్సిపల్ కౌన్సిల్

రాజంపేట, మార్చి 25 ప్రభాత వార్త :

ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో అధికారులు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. అవినీతి అగడం లేదు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దేనికీ స్పందించడం లేదు. సీరియస్ గా మాట్లాడితే తమాషాకు చెప్పారని అంటున్నారు. ఇదేం పద్ధతి. అలాంటప్పుడు అధికారులు ఎందుకని మున్సిపల్ కౌన్సిలర్లు ప్రశ్నించారు. బుధవారం మున్సిపల్ పాలకవర్గ సమావేశం చైర్మన్ పోలా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి జరిగితే తనకెంతో సంతోషమన్నారు. అభివృద్ధికితాను ఎప్పుడూ సహకరిస్తారు అన్నారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి, వాటర్ వర్క్స్ ఇంజనీర్ పనితీరు దారుణంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఇంజనీర్ నరేంద్ర ,కౌన్సిలర్ న్యామతుల్లా మధ్య వాగ్వాదం జరిగింది. మెజార్టీ కౌన్సిలర్లు ఇంజనీర్ పనితీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచినీటి సమస్యను కూడా పట్టించుకోకపోతే ఎలా అని నిలదీశారు. పనితీరు మారకపోతే పనిచేయని అధికారులను సరెండర్ చేసేందుకు వెనుకాడ బోమని కౌన్సిలర్లు ఏకతాటిపై నిలిచి స్పష్టం చేశారు.సమావేశంలో మున్సిపల్ కమిషనర్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## నీటి నాణ్యత పరీక్షలు తప్పనిసరి

బి. కొత్తకోట మార్చి 25 ప్రభాతవార్త ;

బి.కొత్తకోట మండలంలోని పంచాయితీల పరిధిలోని మారుమూల గ్రామాల్లోని నీటి వనరులు నీటి నాణ్యత పరీక్షలు నిర్వహణలో అధికారులు కీలక పాత్ర పోషించాలని డిప్యూటీ ఎంపీడీవో శ్రీనాథ్ రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు నీటి నాణ్యత పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి టి కే కిట్లు ద్వారా గ్రామాలలోని వాటర్ ట్యాంకులు ప్రతిరోజు, 15 రోజుల ఒకసారి ప్రతి ఇంటి నీటిని, నెలకు ఒక మారు స్థానిక పాఠశాలలు, అంగన్వాడీలు, కార్యాలయాలలోని నీటిని నాణ్యత పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. నీటిని నాణ్యత పరీక్షలు నిర్వహించి సంబంధిత రిపోర్టులు ఎప్పటికప్పుడు ప్రత్యేక యాప్ ద్వారా ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలని సూచించారు.

## ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభించాలి..

వేంపల్లె మార్చి 25 ప్రభాతవార్త

పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రారంభించాలని కాంగ్రెస్ నేత డా.తులసిరెడ్డి, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి లు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పులివెందుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించడం శోచనీయం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందే గత ప్రభుత్వం దాదాపు వంద కోట్లు విలువ చేసే యాభై ఎకరాల భూమిని ప్రభుత్వ వైద్య కళాశాలకీ కేటాయించి, భవన నిర్మాణం, మౌలిక సదుపాయాలకు రూ.412 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఆసుపత్రి భవనాలు వందశాతం, 625 పడకల బోధన ఆసుపత్రి అన్న విధాల పూర్తైనట్లు తెలిపారు. ఎన్ఎంసి 2024 25 ఏడాదికి 50 సీట్లను కేటాయించిందన్నారు. అయితే చంద్రబాబు ప్రభుత్వం భవనాలు పూర్తి కాలేదని, ఫ్యాకల్టీ లేదని సాకుతో ఆ సీట్లను వద్దు అని లేఖ రాసిందన్నారు. దీంతో ఆ 50 సీట్లు కోల్పోయిందని, 202627 ఏడాదికి 150 ఎంబిబిఎస్ సీట్లు, 24 పీజీ సీట్లుకు ప్రయత్నమే చేయలేదని విమర్శించారు. పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలను 100 ఎంబిబిఎస్ సీట్లతో ఈ విద్యా సంవత్సరానికి ప్రారంభించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని, పులివెందుల వైద్య కళాశాలను ఏమాత్రం పట్టించుకోకపోవడం అన్యాయం అన్నారు. ఎన్ఎంసితో ప్రభుత్వం చర్చించి పులివెందుల వైద్య కళాశాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు డా.సుబ్రమణ్యం, అమర్, ఉత్తన్న, రవీంద్రారెడ్డి, బండారు వెంకటేష్, రాజా, రమణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



## పోలీసుల జోక్యంతో జాతర సమస్య పరిష్కారం

ప్రొద్దుటూరు క్రైం, మార్చి 24, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు రూరల్ పీఎస్ పరిధిలోని కొత్తపేట గ్రామంలో 15 సంవత్సరాల తరువాత నిర్వహించనున్న పెద్దమ్మ జాతర వచ్చే నెల 18, 19 తేదీల్లో శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం సీఐ నాగభూషణ్, సబ్ ఇన్స్పెక్టర్లు కేసీ రాజు, శ్రీకాంత్‌లు కలిసి గ్రామాన్ని బుధవారం సందర్శించారు. జాతర నిర్వహణకు సంబంధించి గ్రామంలోని 2 వర్గాల మధ్య స్వల్ప విభేదాలు ఉన్నందున ఈ క్రమంలో గ్రామ పెద్దలు, ఇరు వర్గాల వారితో సమావేశం నిర్వహించి పరస్పర చర్చల ద్వారా సమస్యను సక్యతతో పరిష్కరించారు. జాతర వేడుకలను శాంతియుతంగా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహించుకోవాలన్నారు. చట్టాలను గౌరవిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని గ్రామస్థులకు సూచించారు. ఎవరైనా చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ తెలిపారు.



# రైతును రాజుగా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యం



లక్కిరెడ్డిపల్లి: మార్చి 25 ప్రభాతవార్త

రైతుల రాజుగా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ షఫీ నాయక్ పేర్కొన్నారు. రాష్ట్ర రవాణా క్రీడ యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆయన సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ల ఆదేశాల మేరకు బుధవారం టౌన్, గాండ్లపల్లిలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మెన్ షఫీ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం చేత చేపట్టిన రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా అన్నదాత సుఖీభవ మూడో విడత రైతులు ఖాతాలో జమ అయిన సందర్భంగా వ్యవసాయ అనుబంధ రంగాలు మార్కెటింగ్ శాఖ అధికారులతో కలిసి ప్రతి రైతు ఇంటి దగ్గరికి వెళ్లి రైతును రాజుగా చేసేందుకు మన ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ఇంకా అమలు చేయబోయే పథకాల గురించి వివరించారు. అనంతరం రైతుల సమస్యలు తెలుసుకుని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి, ఆయన సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డిల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని మార్కెట్ చైర్మన్ రైతులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాలు, మార్కెటింగ్ శాఖ అధికారులు, టిడిపి నాయకులు పెద్ద రెడ్డెయ్య యాదవ్, అహ్మద్, రామచంద్ర, నాగేంద్ర, జయచంద్రా రెడ్డి, రామాంజనేయులు, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి వృధాను అరికట్టాలి



తంబళ్లపల్లె మార్చి 25 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె మండలంలోని 21 పంచాయతీల్లో గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి వృధాను అరికట్టడానికి సహకరించాలని ఎంపీడీవో బాపూజీ పట్నాయక్ సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నీటి సంరక్షణ పై ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు మెంబర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో థామస్ రాజా మాట్లాడుతూ రాబోయే వేసవి దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో తాగునీటి వృధా చేయరాదని ప్రతి ఒక్కరు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. గ్రామాలలో ఉపాధి హామీలో నీటి సంరక్షణ పనులు వేగవంతం చేయాలని అదేవిధంగా ప్రజలు సైతం అవగాహన పెంచుకొని నీటి సంరక్షణ తమ వంతు బాధ్యతగా వ్యవహరించే లా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్, కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపిడిఓ కార్యాలయంలో రాజ్యజల ఉత్సవపై ఒకరోజు శిక్షణ



రామసముద్రం మార్చి 25 ప్రభాతవార్త

రామసముద్రం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో రాజ్యజల ఉత్సవ ఒకరోజు కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ లకు, ఎంపిటీసీ లు వార్డు మెంబర్ లు, అధికారులు, సిబ్బంది కి ఒరియంటేషన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎంపిడిఓ లతీఫ్ ఖాన్, ఎంపిడిఓ 1 అన్నపూర్ణ, డిప్యూటీ ఎంపిడిఓ కృష్ణవేణి ఆధ్వర్యంలో ఎంపిపి రమణారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఎంపిడిఓ లతీఫ్ ఖాన్, ఎంపిపి రమణారెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో నీటి సంరక్షణ మరియు వినియోగం పై ప్రజల్లో అవగాహన కల్పించడంలో క్షేత్ర స్థాయిలో పంచాయతీ మండల అధికారుల పాత్ర కీలకమన్నారు. రాజ్యజల ఉత్సవ లక్షాలను వివరిస్తూ, ప్రతి గ్రామంలో నీటి వనరుల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జలసంరక్షణ లో వివిధ శాఖల మధ్య సమన్వయం ఎలా ఉండాలనే అంశంపై ఈ సందర్భంగా చర్చించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎంపిడిఓ లతీఫ్ ఖాన్, ఎంపిపి రమణారెడ్డి, పంచాయతీ ఇంజనీర్లు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ఎంపిటీసీ లు, వెలుగు కార్యాలయసిబ్బంది, వార్డు మెంబర్లు తదితరులు హాజరయ్యారు.

## వేసవి క్రీడా శిక్షణా శిబిరాలకు

# ధరఖాస్తు చేసుకోండి

## జిల్లా క్రీడా ప్రత్యేక అధికారి చంద్రశేఖర్




మదనపల్లె, మార్చి 25 ప్రభాతవార్త :

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శ్యాప్) సూచనల మేరకు జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించబడనున్న వేసవిక్రీడా శిక్షణా శిబిరాలు 2026 విజయవంతంగా నిర్వహించేందుకు అనుభవం కలిగిన క్రీడాకారులు, ఫిజికల్ డైరెక్టర్లు నుంచి ధరఖాస్తులు కోరుతున్నామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ మస్తాన్‌లు తెలిపారు. ప్రధానంగా బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, చెస్, అథ్లెటిక్స్, కోకో, బ్యాట్మింటన్, కబడ్డి, జూడో, హ్యాండ్‌బాల్, షూటింగ్‌బాల్, కరాటే, తైక్వాండో, హాకీ, వాలీబాల్ క్రీడలకు శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న అనుభవం ఉన్న సంబంధిత విద్యాఅర్హతలు ఉన్నవారు ధరఖాస్తులు చేసుకోవ చ్చునన్నారు. వివరాలకు సెల్‌నెంబర్ 7386901200, 9154731106 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

# వారపు సంత ఆదాయం ఫుల్ వసతుల నిల్

## పీలేరు పంచాయతీ వారపు, రోజువారీ సంతల ఆదాయం రూ.44 లక్షలు సరే , మరి వసతులు ఏవి
## సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్

పీలేరు, మార్చి 25 ప్రభాతవార్త:

పీలేరు పంచాయతీ ఈవో తమ పరిపాలనలో వారపు సంత, రోజువారి సంత, జంతు వదశాలలు ద్వారా రూ.44 లక్షల ఆదాయం వచ్చిందని గొప్పలు పలికారు. ఆదాయం వచ్చినది బాగుంది.. కానీ, ఈ ఆదాయం రైతులు, వ్యాపారస్తులు, వినియోగదారుల రక్తాన్ని జలగల్ల పిండితే వచ్చిందని ఈవో గుర్తుంచుకోవాలని సిపిఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి ఎల్ వెంకటేష్ అన్నారు .

**వారపు సంతలో మౌలిక వసతులు నిల్:**

వారపు సంతల్లో కనీస వసతులు కూడా కల్పించలేదు. నీరు, మూత్రశాలలు, రోడ్లు, విద్యుత్, పార్కింగ్, డ్రైనేజ్ వంటివి లేకపోవడంతో రైతులు తమ పంటలు, కూరగాయాలు, అమ్ముతూ రోజంతా ఇబ్బంది పడుతున్నారు. ట్రాఫిక్ జామ్‌లతో సంతలో ఇబ్బందులు పడుతున్నారు. సామాన్య వినియోగదారులు కలుషిత పరిసరాల్లో షాపింగ్ చేస్తూ ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు. ఈవో గారి ఖీఆదాయ రికార్డుఖీ అంటే ఇదేనా? ఇది పరిపాలనా వైఫల్యం, రాజకీయ మోసం!ఈ పరిస్థితి మారాలంటే పంచాయతీ ఈవో తక్షణం సంతల్లో కనీస వసతులు (నీరు, మూత్రశాలలు, రోడ్లు, లైటింగ్) కల్పించడంతోపాటు రైతులు వ్యాపారం నిర్వహించేందుకు షెడ్లు నిర్మించాలన్నారు . ఈ ఓ రైతులువ్యాపారుల సమస్యలు విని, 15 రోజుల్లో భర్తీ చేయాలి. ఆదాయాన్ని సంతల అభివృద్ధికి ఖర్చు చేసి చూపించాలి. ఈవో గారు స్పందించకపోతే, రైతులువ్యాపారులు ఈ సమస్యలను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలకు దృష్టికి తీసుకెళ్తాము. పీలేరు ప్రజల హక్కులు కాపాడు కోవాలంటే, ఈవో చర్యలు తీసుకోవాలని టిఎల్ వెంకటేష్ కోరారు.



## ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

# రాయచోటి సిటీ యూనిట్ సభ్యుల ఎన్నిక

రాయచోటి మార్చి 25 ప్రభాతవార్త

ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు యం వేణుగోపాల్ రెడ్డి పర్యవేక్షణలో అబ్జర్వర్ జె శ్రీనివాసన్ ఆధ్వర్యంలో రాయచోటి సిటీ యూనిట్ నందు ఖాళీగా ఉన్న వివిధ స్థానాలకు గాను సెక్రెటరీగా పి.మహాదేవ, అనిమల్ హస్బెండ్రి డిపార్ట్మెంట్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డి.వి. శివారెడ్డి, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ వైస్ ప్రెసిడెంట్స్ గా యం.వరలక్షుమమ్మ, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ యం రామ్మూర్తి, సీరికల్చర్ డిపార్ట్మెంట్ యం.రఘు నాథ నాయక్, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ జ్ఞానదీప్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ గాయం నిహారిక, జాయింట్ సెక్రెటరీ గా కో ఆప్షన్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా యం వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు కోసం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ శ్రీ అలపర్తి విద్యా సాగర్ ఒక్కొక్కటి విడతల వారిగా విడుదల చేయించడానికి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. రావాల్సిన బకాయిల కోసం పోరాడటానికి రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. తాలూకా స్థాయి నుంచి మనం ఎపుడైనా రావాల్సిన బకాయిలను రాబట్టడం కోసం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీజీఓఖిస్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా సెక్రటరీ శ్రీనివాసన్, కోశాధికారి జి నాగేశ్వర్, రాయచోటి సిటీ యూనిట్ ప్రెసిడెంట్ డి. వెంకటేశ్వర్ రెడ్డి , కార్యవర్గ సభ్యులు మరియు ఉద్యోగులు హాజరయ్యారు.



# రోగులను మోసం చేస్తున్న పట్టణంలోని హాస్పిటల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

## ఎన్.టి.ఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ గారికి వినతిపత్రం సమర్పించిన విద్యార్థి నాయకులు

పీలేరు, మార్చి 25 ప్రభాతవార్త:

పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని పీలేరు పట్టణంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్ పూర్తిగా దుర్వినియోగం చేస్తూ రోగులను మోసం చేస్తున్నదని, హాస్పిటల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులతో కలిసి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ వినతిపత్రం సమర్పించినట్లు ఎన్.ఎస్.యూ.ఐ, వై.ఎస్.ఆర్.ఎస్.యూ, డి.బి.ఎస్.ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ, జిల్లా అధ్యక్షులు సాయి సంపత్, వై.ఎస్.ఆర్.ఎస్.యూ జిల్లా ఉపాధ్యక్షులు మలతోటి నరేష్ కుమార్, డి.బి.ఎస్.ఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు బద్దె భాను ప్రకాష్ మాట్లాడుతూ పీలేరు పట్టణంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద చికిత్స పొందిన రోగి నుండి అక్రమంగా డబ్బులు వసూలు చేయడం తీవ్రంగా ఖండనీయమని తెలిపారు. పథకం ప్రకారం రోగులకు పూర్తిగా ఉచిత వైద్యం అందించాల్సి ఉన్నప్పటికీ, కొన్ని నెట్వర్క్ హాస్పిటల్స్ ఈ పథకాన్ని తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటూ పేద ప్రజలను మోసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



# ఆశావర్కర్ల జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

## జిల్లా ప్రధాన కార్యదర్శి మహరున్నీసా



మదనపల్లె, మార్చి 25 ప్రభాతవార్త :

ఈనెల 30న మదనపల్లెలో జరిగే ఆశా వర్కర్ల యూనియన్ రెండవ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆశా యూనియన్(సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి మహరున్నీసా కోరారు. బుధవారం సిఐటియు కార్యాలయంలో ఆశావర్కర్ల నాయకులతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జయమ్మ, ప్రధాన కార్యదర్శి మహరున్నీసాలు మాట్లాడుతూ మహాసభలో గత మూడు సంవత్సరాల పోరాటాలు, అనుభవాలు ఫలితాలపై చర్చిస్తారని తెలిపారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి హాజరవుతారన్నారు. ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడం జరుగుతుందన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, లేబర్‌కోడ్ రద్దు చేసి కార్మిక చట్టాలను పటిష్ట పరచాలన్నారు. ఆశా వర్కర్ల నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలన్నారు. వర్కర్లుకు రూ.10లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు.

# 108 వైద్య సేవలను తనిఖీ చేసిన ఎన్టీఆర్ వైద్యసేవ కోఆర్డినేటర్ లోకవర్ధన్



కలికిరి, మార్చి 25, ప్రభాతవార్త:

పీలేరు-కలికిరి రోడ్డు మార్గంలో బుధవారం 108 వైద్య సేవలను అన్నమయ్య జిల్లా ఎన్టీఆర్ వైద్యసేవ కోఆర్డినేటర్ డా.లోకవర్ధన్ ఆకస్మిక తనిఖీ చేశారు. కురబలకోటకు చెందిన 108 అంబులెన్స్ రోగులను తిరుపతి ఆసుపత్రికి తరలిస్తుండగా జిల్లా కోఆర్డినేటర్ డా.లోకవర్ధన్ ఆకస్మికంగా 108 వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు, రోగులకు ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా అందిస్తున్న సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ డా.లోకవర్ధన్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వ్యక్తులు ఫోన్ చేసిన వెంటనే 108 సిబ్బంది జాప్యం చేయకుండా సంఘటనా స్థలానికి వెళ్లి రోగులకు వైద్యంఅందించి మెరుగైన వైద్యం కోసం పభుత్వా సుపత్రికి తరలించాలని 108 సిబ్బందిని డా.లోకవర్ధన్ ఆదేశించారు.

# ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంబేపల్లి మార్చ్ 25 ప్రభాతవార్త

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్ తెలిపారు. మార్చి 17 వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపు, 18 వ తేదీ నుండి ఆన్లైన్ దరఖాస్తుల స్వీకర ణప్రారంభమైందన్నారు. పరీక్షలు రాస్తున్న పదవ తరగతి విద్యార్థులు ఇప్పటికే పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఏప్రియల్ 30 తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చుని తెలిపారు. మే 1 న ఆన్లైన్ దరఖాస్తుల జాబితా ప్రచురణ, 3వ తేదీన పాఠశాల స్థాయిలో మెరిట్ లిస్ట్ తయారీ, 5న ఎంపిక జాబితా ప్రచురణ, 6న సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 150 రూపాయలు, బీసీ, ఓసి విద్యార్థులు 200 రూపాయలు దరఖాస్తు రసం చెల్లించాలన్నారు. ఎంపీసీ, బై పీసీ, ఎం బై పీసీ, ఎం ఈసీ, సీఈసీ గ్రూపులు కలవని ఒక్క గ్రూపులో 40 సీట్లు ఉన్నట్లు తెలిపారు.

# నిబంధనల మేరకు గ్యాస్ సిలీండర్లు సరఫరా చేయాలి

## వినియోగదారులకు సక్రమంగా సిలిండర్లు పంపిణీ చేయాలి
## తహసిల్దార్ ఎం శివకుమార్



పీలేరు, మార్చి 25 ప్రభాతవార్త :

ప్రభుత్వ నిబంధనల మేరకు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని తహశీల్దార్ శివకుమార్ అన్నారు. బుధవారం స్థానిక శ్రీదుర్గా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ను, సిలిండర్ల బరువు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 33 వేలు ఎల్పీజీ, కమర్షియల్ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. పీలేరులో ఉన్న మూడు గ్యాస్ ఏజెన్సీలు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బుకింగ్ మేరకు సిలిండర్లు సరఫరా చేయాలని ఆదేశించారు. బ్లాక్ మార్కెట్ లో సిలిండర్లు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులు ప్రస్తుత విపత్తు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్యాస్ను దుర్వినియోగం చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ విజయ్కుమారెడ్డి. ఆర ఎస్. మురగయ్య, వీఆర్వో కల్యాణి, దుర్గా గ్యాస్ ఏజెన్సీ అమరేంద్రనాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీలు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి

## వైద్యురాలు శ్రీగిరీష



పీలేరు మార్చి 25 ప్రభాతవార్త:

ఆరోగ్య సేవల ఫలితంగా, పుట్టబోయే శిశువు ఆరోగ్య భద్రతతో పాటు తెలివైన తరం సాధ్యమని, పి.హెచ్.సి తలుపుల ప్రధాన వైద్యాధికారులు శ్రీగిరీష అన్నారు. గాండ్లపల్లిలో నిర్వహించిన మాతశిశు సంరక్షణ సేవల్లో భాగంగా గర్భిణీస్త్రీలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ ఆరోగ్యంగా జన్మించే ప్రతి శిశువు ఈ సమాజానికి అమూల్యమైన బహుమతి అని, నిర్దేశించిన సమయానికి ఉచిత ఆరోగ్యసేవలు, శిశువు యొక్క సామాజిక, మానసిక ఎదుగుదలకు సహకరించే, ఐరన్ ఫోలిక్ మాత్రలు, తాజా ఆకుకూరలు, కాయగూరలు పండ్లు, పాలు, గ్రుడ్లు, తక్కువ మోతాదులో ఎక్కువసార్లు తింటూ, అంగన్వాడీ లో లభ్యమయ్యే పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని, అంతర్జాతీయ గర్భస్థ శిశువుల దినోత్సవం సందర్భంగా, ఇది అందరి బాధ్యతని వైద్యురాలు శ్రీగిరీష పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఇఓ కొండయ్య, ఏయన్‌యం రేణుక, ఉమ, సిహెచ్‌ఓ రాజేశ్వరి, సుధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిసి రోడ్ల పనులు వేగవంతం చేయండి

## పిఆర్.డి.ఈ మునిరాజ్



తంబళ్లపల్లె మార్చి 25 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులలో భాగంగా చేస్తున్న సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ డిఇ మునిరాజ్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని తంబళ్లపల్లె, ఎద్దుల వారి పల్లి పంచాయతీలలో జరుగుతున్న సిసి రోడ్ల పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 20 47 లో భాగంగా చేస్తున్న పనులలో నాణ్యత లోపం లేకుండా చూడాలని అదేవిధంగా ప్రజలకు సౌకర్యవంతంగా పనులు చేపట్టాలని ఏఈ వెంకటరమణ కు సూచించారు. అనంతరం ఆయన తంబళ్లపల్లె ఆర్టీసీ బస్టాండ్ కాలనీ, మసీదు వీధి, శ్రీనివాస కాలనీ సిసి రోడ్ల పనులను పరిశీలించారు. ఆయన వెంట కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఊరు బడిని కాపాడుకుందాం

## యూటీఎఫ్ ఆధ్వర్యంలో బడిబాట



మదనపల్లెక్రైమ్, మార్చి 24 ప్రభాతవార్త.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మదనపల్లి పట్టణంలో ఊరు బడిని కాపాడుకుందాం అనే నినాదంతో బడిబాట కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాలాజీ మున్సిపల్ ప్రైమరీ పాఠశాల పరిసర ప్రాంతాలైన బ్యాంబు బజార్, సంత వీధులలో బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటిని సందర్శించారు. ప్రభుత్వ బడుల్లో అందుతున్న మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, ఇతర సౌకర్యాల గురించి కరపత్రాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు పురం వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు అత్యున్నత అర్హతలు, అపారమైన అనుభవం కలిగినవారన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, ఒత్తిడి లేని బోధనా పద్ధతుల గురించి తల్లిదండ్రులకు వివరించారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలాజీ మున్సిపల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజులాదేవి, డివిజన్ కన్వీనర్ సుధాకర్, పయని, శ్రీనివాసులు, ప్రసాద్, రాము, రాజేశ్వరి, యాస్మిన్ పాల్గొన్నారు.

# వైద్యులు రిఫర్ చేసిన రోగిని రుయాకు తరలించడానికి నిరాకరించిన 108 సిబ్బంది



మదనపల్లెక్రైమ్, మార్చి 24 ప్రభాతవార్త.

ఆత్మహత్యయత్నంకు పాల్పడిన ఓరోగిని తిరుపతి రుయా ఆసుపత్రి కి తరలించాలని మదనపల్లి వైద్యులు రిపేర్ చేయగా అతన్ని తీసుకెళ్లడానికి 108 సిబ్బంది నిరాకరించిన సంఘటన బుధవారం మదనపల్లిలో జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె పట్టణం పప్పిరెడ్డిపల్లికి చెందిన లక్ష్మీదేవి (30) ఎలుకల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా, చికిత్సలు చేసిన మదనపల్లి జిల్లా ఆసుపత్రి వైద్యులు ఆమెను మెరుగైన చికిత్స కోసం తిరుపతికి రిఫర్ చేశారు. అయితే, అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది.. రోగికి బీపీ, షుగర్ సాధారణంగా ఉన్నాయని సాకు చూపి తరలించడానికి నిరాకరించారు. విజయవాడ ఈఆర్ టీపీ డాక్టర్ అనుమతి ఇవ్వలేదని చెబుతూ, చావుబతుకుల్లో ఉన్న రోగిని ఆసుపత్రిలోనే వదిలేసి వెనుదిరిగారు. వైద్యులు వెళ్లమన్నా 108 వారు వెళ్ళిపోయారు, నా భార్యకు ఏమైనా జరిగితే వారే బాధ్యులు అవుతారని బాధితురాలి భర్త శ్రీరాములు కన్నీటి పర్వతమయ్యారు.

## పురపాలక కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం



**బద్వేలు అర్బన్, మార్చి 25, ప్రభాతవార్త**

స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ మరియు ఆల్ ఇండియా లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక పురపాలక కార్యాలయ సభ భవనంలో మెప్మా రిసార్స్ పర్సన్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిర్మూలన, స్వచ్ఛ సర్వేక్షణ వంటి ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. స్వచ్ఛ ఆంధ్ర సంస్థ నుంచి డా. కె. శీనివాసు, కరుణాకర్ శిక్షకులుగా పాల్గొని ప్రాయోగిక విధానాలతో శిక్షణ అందించారు. శిక్షణ కార్యక్రమాన్ని పురపాలక కమిషనర్ వి.వి. నరసింహ రెడ్డి, ఇంచార్జి పారిశుధ్య పరిశీలకుడు రమణయ్య, సిఎంఎం కల్యాణ్, మెప్మా అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉత్తమ పద్ధతులను నేర్చుకుని వృత్తిలో ప్రత్యేక గుర్తింపు సాధించాలని, ఇలాంటి శిక్షణలు సిబ్బందికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. శిక్షణలో భాగంగా చర్చలు, ప్రదర్శనల ద్వారా అంశాలను సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సంస్థల సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## ఏకగ్రీవమైన బార్ అసోసియేషన్ ఎన్నికలు

**బద్వేలు లీగల్, మార్చి 25 ప్రభాతవార్త:**



బ్రహ్మారెడ్డి



ఆర్.రవీంద్ర వర్మ.



రమణారెడ్డి

రాష్ట్ర వ్యాప్తంగా పదవీ కాలం ముగిసిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశానుసారం బద్వేలు బార్ అసోసియేషన్ ఎన్నికలు తే.24-3-2026 దీ సాయంత్రం 5 గంటల వరకూ ఏలాంటి నామినేషన్లు ఉపసంహరణలు జరుగకపోవడంతో పోటీ చేసిన న్యాయవాద అభ్యర్థులే తే.25-3-2026 ది సాయంత్రం 5 గంటల అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.జె.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలియజేస్తూ బద్వేలు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడుగా దేవిరెడ్డి బ్రహ్మ రెడ్డి, ఉపాధ్యక్షుడుగా ఆర్.ఆర్.వర్మ, ప్రధాన కార్యదర్శిగా సింగల్‌రెడ్డి రమణా రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా కె.శశాంక్ శ్రీవాత్సవ, గ్రంథాలయ కార్యదర్శిగా కొడవటికంటి బాబు, కోశాధికారిగా నూతి శ్రీనివాసులు, క్రీడా కార్యదర్శిగా టి.సురేష్ బాబు, సాంస్కృతిక కార్యదర్శిగా డి.ఎం.అఫ్తాబ్ హుస్సేన్, మహిళా ప్రతినిధిగా వి.సాయి తపస్విలు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా జి.జె.పి.ప్రభాకర్ రావు, బి.వి.రవి కుమార్, ఎం.చంద్రశేఖర్ రెడ్డి, జి.ప్రవీణ్ కుమార్‌లు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియుక్తులయ్యారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.జె.ప్రభాకర్ ధృవీకరిస్తూ ఈ ఫలితాలను వెల్లడించారు.

## యశోద హాస్పిటల్‌లో ఆధునిక వైద్యం

**ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 25, ప్రభాతవార్త**




క్రిటికల్ కేర్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్ రామన్ కోలా బుధవారం స్థానిక కొవ్వూరు గ్రాండ్‌లో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యశోద హాస్పిటల్స్ ఈసీఎంఓ ప్రమాణాలకు గ్లోబల్ స్టాండర్డ్స్ కలిగిన ఎక్స్ట్రా కార్పోరియల్ లైఫ్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ద్వారా లైఫ్ సపోర్ట్ ఎక్సలెన్స్ కోసం అత్యున్నత స్థాయి ప్లాటినం అవార్డును అందుకున్నందుకు గర్వంగా ఉన్నట్లు ఆయన అన్నారు. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు ద్వారా యశోద హాస్పిటల్స్ భారతదేశంలోని ఏకైక ప్లాటినం సర్టిఫైడ్ ఈసీఎంఓ సెంటర్గా నిలిచిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అత్యున్నత స్థాయి ఎక్స్ట్రా కార్పోరియల్ లైఫ్ సపోర్టు అందించే ఉన్నత స్థాయి కేంద్రాలలో ఒకటిగా నిలిచిందన్నారు. ఈఎల్ఎస్ఓ ప్లాటినం గుర్తింపు పేషెంట్ యొక్క భద్రత, క్లినికల్ ఎక్సలెన్స్ మరియు అత్యున్నత అంతర్జాతీయ ప్రమాణాలకు కట్టుబడి ఉండటంపై మా నిరంతర దృష్టికి నిదర్శనమన్నారు. ప్రముఖ ప్రపంచ కేంద్రాలతో పోల్చదగిన ఫలితాలతో కాలేయం, మూత్రపిండాలు, గుండె, ఊపిరితిత్తులు మరియు ఎముక మజ్జ మార్పిడితో సహా సమగ్ర మార్పిడి సేవలు, అవయవ మార్పిడి, పునరుద్ధరణకు వారధిగా ఈసీఎంఓ, ఎండ్‌స్టేజ్ కార్డియాక్ లేదా రెస్పిరేటరీ ఫెయిల్యూర్ ఉన్న పేషెంట్లకు ప్రాణాలను రక్షించే మద్దతును అందిస్తుందన్నారు. అత్యంత తీవ్రమైన అనారోగ్యం కలిగిన పేషెంట్లక సకాలంలో, కరుణతో కూడిన మరియు అంతర్జాతీయంగా బెంచ్ మార్క్ చేయబడిన సంరక్షణ లభించేలా చూడటం తమ లక్ష్యమన్నారు. అధునాతన ఆరోగ్య సంరక్షణలో దాని అగ్రగామిగా కొనసాగడాన్ని పునరుద్ఘాటిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హరి కిరణ్ టీమ్ లీడర్, మధుసూదన్ పాల్గొన్నారు.

## లేగ దూడల సంరక్షణ
## పోషణ పద్ధతులు గురించి వివరణ



**సుండుపల్లె, మార్చి 25, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని మన్యంవారిపల్లి నందు పశు సంవర్ధక శాఖ సంచాలకులు డా కె. విజయకుమార్ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమము రాయచోటి డివిజన్ పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డా.డి.మాల కొండయ్యా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు లేగ దూడల పెంపకం నందు మెలుకువలు మరియు వ్యాధి నిరోధక టీకాలను గురించి వివరించడం జరిగినది. అదే విధంగా జిల్లా లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ కార్య నిర్వహణ అధికారి డా. సి హెచ్ రాజా తిమ్మా రెడ్డి రైతులని ఉద్దేశించి లింగ నిర్ధారణ వీర్యం వాడుకని గురించి రైతులకు వివరించడం జరిగింది. ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డా. కె విజయ కుమార్ మాట్లాడుతూ రైతులకు తమ పశువుల పట్ల ఎద లక్షణాలు మరియు చూలు పశువుల యాజమాన్య పద్ధతుల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక పశువైద్యాధికారి రవి కుమార్ నారే మాట్లాడుతూ లేగదూడల సంరక్షణ పోషణ పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ప్రదర్శన కనిపించిన దూడలకు బహుమతులు, పాల్గొన ప్రతి రైతు సోదరులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంబులెన్స్ డాక్టర్ గణేష్, ఎల్ఎస్ఏ రమణ, ఏహెచ్ఏలు, గోపాల మిత్రులు పాల్గొన్నారు.

## అరటి రైతులను ఆదుకోవాలి.

**పులివెందుల,మార్చి 25, ప్రభాత వార్త :**

పులివెందుల ప్రాంతంలో అరటి రైతులకు గిటుబాటులేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అరటి రైతన్నలను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పులివెందుల ఇన్చార్జి నాయకులు మనోహర్ పులివెందుల సిపిఎం నాయకులు గఫూర్లు ఒక సంయుక్త ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా రైతు అరటి సాగు పులివెందుల ప్రాంతంలో ఎక్కువ పండిస్తారని తెలిపారు. అదే తరుణంలో జిల్లా అంతా కూడా రైతాంగం అనేక సమస్యలు ఎదుర్కొంటు న్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో అరటి రైతన్న నలకు కనీస గిట్టుబాటు ధర కల్పించాల్సి నటువంటి అవసరం ఉన్నది అన్నారు. అదే తరుణంలో ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. రైతాంగం లేకపోతే ఈ దేశ పురోగ వృద్ధి లేదని తెలిపారు .మన శరీరంలో వెన్నముక ఎలాగో దేశంలో, రాష్ట్రంలో, జిల్లాలో రైతున్నలు అంతే కీలకమన్నారు. అలాంటి పరిస్థితుల్లో అరటి రైతాంగాన్ని ఆదుకోవాల్సి న టువంటి అవసరం ఉన్నదన్నా రు. నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాల్సి నటువంటి అవసరం ఉందన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతాంగానికి న్యాయం చేయాలని కోరారు.

# అంకురారోపణతో కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం







**ఒంటిమిట్ట మార్చి.25.ప్రభాతవార్త**

ఆంధ్ర రాష్ట్రంలోని తలమానికంగా నిలిచి మూడు రాష్ట్రాల ప్రజలతో నీరాజనాల అందుకుంటు నింగిలోని ధ్రువతార వలె ప్రకాశిస్తూ రెండవ అయోధ్య ఆంధ్ర భద్రాచలం ఏకశిలానగరం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో అంకురారోపణ కార్యక్రమంతో మార్చి 27వ తేదీ నుంచి ఏప్రిల్ 05వ తేదీ వరకు అంగరంగ వైభవంగా ప్రారంభమవుతున్నాయి. 26వ తేదీ గురువారం సాయంత్రం అంకురారోపణ ,ద్వజావరోహణం కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలకు అర్చకులు నాంది పలకనున్నారు. పాంచరాత్ర ఆగమం ప్రకారం వైష్ణవ సంప్రదాయ పద్ధతిలో అర్చకులు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. శ్రీరామనవమి, పోతన జయంతి, గడోత్సవము, హనుమంత సేవ, సీతారామ కళ్యాణోత్సవం, రథోత్సవం, పుష్పయాగం, ఏకాంత సేవ కార్యక్రమాల్లో విశేషంగా వేల సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈ కార్యక్రమాలకు వచ్చే భక్తులకు టీటీడీ అధికారులు అన్ని మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు, అన్నదాన కార్యక్రమాలు అన్న ప్రసాద కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఎటువంటి లోటు లేకుండా రామయ్య భక్తులను టిటిడి అధికారులు పర్యవేక్షిస్తూ సౌకర్యాలు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలోకి వెళ్లేందుకు క్యూలైన్లు, తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేస్తూ సుందర వదనంగా మాడవీధులను, పరిసరాలను రంగవల్లికలతో తీర్చిదిద్దుతున్నారు. ఆలయం వెలుపల లోపల భాగాల్లో జర్మనీ షెడ్లు, ఆలయం నుంచి కళ్యాణ వేదిక వరకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయడం జరిగింది. ఒంటిమిట్ట రామాలయం నుంచి దాదాపుగా 8 కిలోమీటర్ల వరకు హరినామ స్మరణల మైకు సెట్లు ,దశావతార ఫ్లెక్సీలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 01 వ తేదీ టీటీడీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించే సీతారామ కళ్యాణోత్సవ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దంపతులు రాష్ట్ర పండుగ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి లాంఛనంగా స్వామి అమ్మవారికి పట్టు వస్త్రాలు, ముత్యాలు తీసుకొని హాజరు కావడం జరుగుతుంది. అదేవిధంగా రాష్ట్ర మంత్రులు, నియోజకవర్గ ఎమ్మెల్యేలు కూడా కళ్యాణోత్సవానికి హాజరవుతున్నారు. జిల్లాస్థాయి ప్రభుత్వ అధికార యంత్రాంగంతో టీటీడీ అధికారులు సమన్వయం చెంది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గతించిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి రాజీ లేకుండా ఏ విషయమైనా ఒకటికి రెండుసార్లు పరీక్షించి పరిశీలించి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. సీతారామ కళ్యాణోత్సవం నాడు విశేష సంఖ్యలో భక్తులు హాజరవుతున్న నేపథ్యంలో టీటీడీ అధికారులు అన్నీ సౌకర్యాలు కల్పిస్తూ వేసవికాలం దృష్టిలో ఉంచుకొని ముందుకు సాగుతున్నారు. పోలీసు బలగాల దృష్ట్యా క్షేత్రస్థాయి పోలీస్ అధికారులు పోలీసు సమావేశాలు ఏర్పాటు చేస్తూ దిశా నిర్దేశితాలు తెలియజేస్తున్నారు. విశాలవంతమైన వాహన నిలుపుదల ప్రదేశాలు, హైదరాబాద్ చెన్నై జాతీయ రహదారి లో ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం కొలువై ఉండడం చేత ట్రాఫిక్కుకు ఎటువంటి అంతరాయం లేకుండా వాహనాల మళ్లింపుకై ప్రత్యేక ప్రదేశాలను ఏర్పాటు చేస్తున్నారు. కళ్యాణ వేదికను టిడిపి అధికారులు అలంకరించడం జరిగింది. ప్రత్యేక క్యూ లైన్లు, అలంకరణలు, టెలివిజన్లు, ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం నిర్వహించాల్సిన పనులన్నీ ఒక ప్రణాళిక ప్రకారం నిర్వహిస్తున్నారు. వేసవికాలం కావడం చేత మంచినీరు, మజ్జిగ, అన్న ప్రసాదాలు భక్తులకు అందిస్తున్నారు. కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా పూర్తి చేసేందుకు అన్ని శాఖలకు చెందిన జిల్లా క్షేత్రస్థాయి ప్రభుత్వ అధికారులు, టీటీడీ ఉన్నతాధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. అతి పురాతన ప్రాశస్తం, చరిత్ర, చోళుల, విజయనగర సామ్రాజ్య కాలం నాటి శిల్ప కలలు కలిగిన శ్రీ కోదండ రామాలయం ఏకశిలానగరం ఒంటిమిట్ట క్షేత్రంలో ఉండడం ఎంతో గర్వకారణంగా చెప్పాలి. శ్రీకోదండరామస్వామిని సేవించిన వారిలో తాళ్లపాక అన్నమాచార్యులు, వీరబ్రహ్మేంద్రస్వామి, అయ్యల రాజు రామ భద్రుడు, నవాబు కాలం నాటి సర్వ సైన్యా ధ్యక్షుడు ఇమామ్ బేగ్, మాల ఓబన్న, వాసు దాస స్వామి అంతటి మహనీయులు కారణజన్ములు పురాణ పురుషులు సాక్షాత్కారం పొందినట్లుగా చరిత్ర చెబుతోంది. సతీ సోదర సమేతంగా శ్రీరామచంద్ర మూర్తి ధనుర్బాణాలంకరణ వేషధారియై స్వయంభుగా ఏకశిలపై కొలువై ఉండడం వల్ల ఏకశిలా నగరంగా నామకరణమైనట్లుగా ఆలయంలోని శాసనాల ద్వారా నిరూపితమవుతోంది. ఒంటడు మిట్టడు గర్భాలయాన్ని నిర్మించిన కారణంగా ఒంటిమిట్టగా నామకరణమైనట్లు చరిత్ర చెబుతోంది. ఏది ఏమైనప్పటికీ శ్రీ కోదండ రామ స్వామి బ్రహ్మోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతాయని ఆశిద్దాం.

## పాలకమండలి చైర్మన్‌గా మల్లికార్జున్ రెడ్డి



**పోరుమామిళ్ల రూరల్, మార్చి 25 ప్రభాతవార్త :**

పోరుమామిళ్ల మండలంలోని గురప్ప గారి పల్లె సమీపంలో ఉన్న మద్యమాను పురప్ప స్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్గా మల్లికార్జున రెడ్డి నియామకమయ్యారు. బుధవారం ఆయన పాలక మండల చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ టిడిపి ఇన్చార్జి రితీష్ రెడ్డి, బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోషన్న తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బసిరెడ్డి రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ... నూతనంగా ఎన్నికైన పాలక మండలి చైర్మన్ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ దేవాలయం మన ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధిగాంచిందని కావున పాలకమండలి సభ్యులంతా ఆలయ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు భక్తులకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరిని అధిష్ఠానం గుర్తిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్మెంట్ డైరెక్టర్ రంతు, స్థానిక టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సమస్యలపై కలిశాను,
## రాజకీయాల కోసం కాదు"

**ట్రోల్స్‌పై వర్ధన్ రెడ్డి ఘాటు స్పందన**



**పులివెందుల, మార్చి 25, ప్రభాతవార్త :**

తనపై సోషల్ మీడియాలో వస్తున్న ట్రోల్స్‌కు పులివెందుల టీడీపీ సోషల్ మీడియా ఇంచార్జ్ వర్ధన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. కసునూరు గ్రామంలో కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి పర్యటన సందర్భంగా తాను కలవడంపై జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా తన తోటతో పాటు గ్రామంలోని అనేక అరటి తోటలు దెబ్బతిన్నాయని తెలిపారు. బాధిత రైతుగా షర్మిలను కలిసి సమస్యలు వివరించానని, పార్టీ హోదాలో కాదు అని స్పష్టం చేశారు. షర్మిల రాకమునుపే ప్రభుత్వం స్పందించిందని, టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి ఇప్పటికే గ్రామాన్ని సందర్శించి రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. అధికారులు కూడా క్షేత్ర స్థాయిలో పంట నష్టం వివరాలు సేకరించి నివేదిక ఇచ్చారని తెలిపారు. తన భేటీని వక్రీకరించి టీడీపీషర్మిల కలయిక"గా ప్రచారం చేయడం తగదని విమర్శించారు. వాస్తవాలు తెలుసుకోకుండా ట్రోల్స్ చేయడం బాధాకరమని, అయితే అది తనకు నష్టం కంటే ఫ్రీ పబ్లిసిటీనే ఎక్కువ ఇస్తుందని వ్యాఖ్యానించారు. రైతుల సమస్యలను మానవీయ కోణంలో చూడాల్సిన అవసరం ఉందని, వాటిపై రాజకీయాలు చేయడం సరికాదని అన్నారు. ఈ ఘటన జరిగినప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్క వైసీపీ నాయకుడు కూడా గ్రామానికి రాలేదని ఆరోపించారు. బీటెక్ రవి, ఇతర నాయకులు వెంటనే స్పందించి తోటలను పరిశీలించారని, రైతులకు అండగా నిలిచారని తెలిపారు. సోషల్ మీడియాలో చిల్లర రాజకీయాలు మానుకుని హుందాగా వ్యవహరించాలని కోరారు.

## కేసీ రైతులకు ఎమ్మెల్యే భరోసా

**దువ్వూరు, మార్చి 25, ప్రభాతవార్త:**



నియోజకవర్గంలోని కెసి రైతులకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ భరోసా కల్పించారు. వివరాల్లోకి వెళితే... కేసి కాలువ కింద సుమారు 6 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. ముఖ్యంగా వరి, మొక్కజొన్న, జొన్న, నువ్వు, మినుము వంటి పంటను రబి సీజన్ లో సాగు చేశారు. ఈ పంటలు రైతుల చేతికి రావాలంటే కేసీ కాలువలో ఏప్రిల్ 15వ తేదీ వరకు నీరు కావాల్సి ఉంది. అయితే గత రెండు రోజులుగా కేసీ కాలువలో రోజురోజుకు నీటిమట్టం తగ్గటంతో సాగుచేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా దువ్వూరు మండలంలో సుమారు 3వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎర్రబల్లె, మాసనపల్లె, బొక్కాయ పల్లె తదితర గ్రామాల్లో ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగు అయింది. వరి పూర్తిగా చేతికి రావాలంటే ఏప్రిల్ 15 వరకు నీరు అవసరం ఉంటుంది. ఈ విషయాన్ని రైతులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకు వెళ్లడంతో సోమవారం ఆయన జిల్లా కలెక్టర్ తో చర్చించారు. అనంతరం జిల్లా కలెక్టర్ తో చర్చించి వచ్చే నెల 15 వరకు మీరు వచ్చే విధంగా చూడాలని కోరారు. అనంతరం కేసీ కాలువ అధికారులతో కూడా చర్చించారు. కేసీ కెనాల్ కు సంబంధించిన డిఈ, ఎస్ఈలతో నీటి విషయంపై చర్చించారు. వెంటనే కర్నూలు జిల్లాలోని సుంకేసుల నుండి నీటిని విడుదల చేసే విధంగా ఏర్పాటు చేశారు. సోమవారం విడుదల చేసిన నీరు రెండు, మూడు రోజుల్లో మైదుకూరు నియోజకవర్గానికి చేరుతుందని ఆయన వివరించారు. కేసీ కాలువ కింద రెండవ పంట సాగు చేసిన రైతులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని వారి పంట చేతికొచ్చే వరకు నీరు వస్తుందని భరోసా కల్పించారు.

## బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ



**ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 25 ప్రభాత వార్త**

స్థానిక బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా గడియారం సుబ్రహ్మణ్యం, ముఖ్య కార్యదర్శిగా వెల్లాల వెంకటసుబ్బయ్య, కోశాధికారిగా నైశదం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా వెల్లాల నరసింహ శర్మ, డాక్టర్ వెంకటనాగసునీల్ కుమార్, జీఎల్ నరసింహాచార్యులు, బదిర ఈశ్వరయ్య, వెల్లాల కోదండరామశర్మ, గౌరవాధ్యక్షులు, గౌరవ సలహాదారులుగా దుర్భాక వెంకటసుబ్బయ్య, కామరాజు శ్రీనివాసకుమార్, చాగంటి వెంకటప్రసాద శర్మ, కైపా వెంకటేశ్వర్లు, యమ్మనూరు రామచంద్ర శర్మ, పాలక వర్గ సభ్యులుగా కందనూరు మధుసూదనాచార్యులు, చింతల సాయి మనోజ్ కుమార్, సదాశివరావు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ బ్రాహ్మణ సేవా సంఘం అభివృద్ధికి, బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లాయర్ మైదుకూరు రమేష్బాబు, దుర్గా వెంకటసుబ్బయ్య, చాగంటి వెంకటప్రసాద్, వేదపండితులు, వాసు స్టూడియో బాల సూర్యరావు, పురోహితులు, అర్చకులు, బ్రాహ్మణులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి



**దువ్వూరు, మార్చి 25, ప్రభాతవార్త:**

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మండల వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి అన్నారు. సోమవారం దువ్వూరు సచివాలయం2 లో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాటి కరపత్రాలను రైతులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుకు పెట్టుబడి సాయంగా పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అలాగే ప్రతి రైతు తాము రిజిస్ట్రేషన్ చేసుకుంటే ప్రభుత్వం నుండి వచ్చే సౌకర్యాలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు గురులక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

## శ్రీ కాశిక్షేత్రస్వామి తృతీయ
## వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలి

**బద్వేలు అర్బన్, మార్చి 25, ప్రభాతవార్త :**

బద్వేలు పట్టనంలోని శ్రీకృష్ణ దేవరాయనగర్, త్యాగరాజు నగర్‌లో వెలసిన శ్రీ కాశివిశ్వేశ్వర స్వామి స్పటిక శివాలయం తృతీయ వార్షికోత్సవ వేడుకలలో భక్తాదులు పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ రామన బోయిన మురళియాదవ్ మరియు పలువురు కమిటి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి సభ్యులు మాట్లాడుతూ కడపజిల్లాలో ఎక్కడా లేనివిధంగా త్యాగరాజు కాలనీలోని 27 అంగుళాల కాశి విశ్వేశ్వర స్వామి ఆలయం నిర్మించి 3 సంవత్సరాలు కావస్తుందని కావున ఈనెల 28 నుంచి 29వ వరకు తృతీయ వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా 28వ తేది శనివారం మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, గణపతిరుద్ర సుదర్శన చండీహోమ కార్య క్రమాలు, రాత్రి గోప ్ర హరి కథ కార్యక్రమం, 29వ తేది ఆదివారం 10 గంటలకు కాశి విశాలాక్షి సమేత శ్రీ కాశి విశ్వనాథ స్వామి కళ్యాణ మహోత్సవం వేదపండితులు బ్రహ్మశ్రీ సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించడం జరుగు తుందని కావున భక్తాదులందరూ పాల్గొని వార్షికోత్సవ కార్యక్రమాన్ని జయప్ర దం చేయాలని కోరారు.




## నేడు గుజ్జుల ఈశ్వరయ్య రాక

**పులివెందుల , మార్చి 25 , ప్రభాత వార్త :**

రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన నూతన మెడికల్ కళాశాలలను పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ (పీపీపీ) విధానంలో ప్రైవేటీకరించా లనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమం ఊపందుకుంటోంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెడికల్ కళాశాలల సందర్శన కార్యక్రమంలో భాగంగా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య నేడు పులివెందుల మెడికల్ కాలేజీని సందర్శించను న్నారు. ఈ విషయాన్ని సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్శనలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఎన్. తులసి రెడ్డి, వైసీపీ నాయకులు ఎస్. సతీష్ కుమార్ రెడ్డి, సిపిఎం నాయకులు ప్రభాకర్ రెడ్డి, సామాజిక ఉద్యమ నేత రిటైర్డ్ ప్రొఫెసర్ సి. రామచంద్రయ్య, ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.వి. రమణయ్య, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షులు కే. నారాయణ పాల్గొననున్నారు. అలాగే మెడికల్ కాలేజీ పరిరక్షణ కమిటీ నాయకులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, కేఎస్ లక్ష్మణరావు, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, డాక్టర్ కుర్ర వసుంధర, కొరివి వినయ్ కుమార్ తదితరులు హాజరవుతారని తెలిపారు. విద్యార్థి, యువజన, ప్ర జా సంఘాల నాయకులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొననున్న ట్లు సమాచా రం. ప్రభుత్వం చేపట్టిన ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకో వాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేయనున్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

**ఒంటిమిట్ట మార్చి.25. ప్రభాతవార్త**

టీటీడీ ఆధ్వర్యంలో ఏప్రిల్ ఒకటో తేదీన నిర్వహించబోయే సీతారామ కళ్యాణోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి దంపతుల సమేతంగా ప్రభుత్వ లాంఛనంగా స్వామి అమ్మవారికి పట్టు వస్త్రాలు, ముత్యాలు తీసుకొని ఆహ్వానం అవుతున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్ల నిమిత్తం బుధవారం టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, కడప జిల్లా ఎస్పీ సచికేత్ విశ్వనాథ్, రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్నాథ్ హెగ్డే ఒంటిమిట్టకు రావడం జరిగింది. టీటీడీ ఆధ్వర్యంలో గుత్తేదారులు చేపడుతున్న ఏర్పాట్లు ముందుగా పరిశీలించారు. శ్రీ కోదండ రామాలయం, కళ్యాణ వేదిక, అన్న ప్రసాద వితరణ కేంద్రం, ఆలయ పరిసరాలు క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. చేయవలసిన పనులను ఎటువంటి జాప్యం లేకుండా సకాలంలో పూర్తి చేయాల్సిందిగా గుత్తేదారులను వారు ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనపై అధికార సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో వారు మాట్లాడుతూ కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి దంపతుల సమేతంగా హాజరవుతున్నట్లు ఒక ప్రణాళిక ప్రకారం పనులన్నీ పూర్తి చేసి భక్తుల భద్రతపై వాహనాల రాకపోకలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిందిగా ఆదేశించారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి కాన్వాయ్ ట్రయల్ రన్, ముఖ్యమంత్రి బస చేయు టీటీడీ అతిథి గృహం ,ఆలయ దర్శనం, అర్చకుల వేద ఆశీర్వచనం తదితర అంశాలపై చర్చ జరిగింది. కళ్యాణ వేదిక వద్ద ఏర్పాటుచేసిన బారికెట్లు, గ్యాలరీలు, భక్తులకు అందించనున్న ప్రసాదం ?క్యూలైన్లు పరిశీలించారు. ముందుగా టీటీడీ జేఈవో వీరబ్రహ్మం మాట్లాడుతూ శ్రీరామనవమి పర్వదినం రోజు 50 వేల నుంచి 60 వేల వరకు భక్తులు ఆలయాన్ని సందర్శించే అవకాశం ఉందని కావున సిబ్బంది భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. భక్తులందరికీ రుచికరమైన అన్న ప్రసాదము, వడపప్పు, పానకం అందించాలన్నారు. ఎండ వేడి తట్టుకునేందుకు భక్తులకు రక్షణగా ఆలయంలో నీటిని పిచికారి చేయాలన్నారు. కళ్యాణానికి వచ్చే ప్రతి భక్తునికి మంచినీటి బాటిల్, మజ్జిగ, అన్న ప్రసాదం అందించాలన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 3000 మంది పోలీసులతో భక్తులకు భద్రత కల్పిస్తున్నట్లు తెలియజేశారు. వాహన పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించడం జరిగిందన్నారు. ఎంచుకోవడం జరిగిందన్నారు. భక్తులకు, పాదచారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్కుకు ఎటువంటి అంతరాయం లేకుండా నిరంతరం వాహన పరిశోధనలు చేస్తూ పోలీసులు భద్రతగా ఉంటారన్నారు. వాహన ప్రదేశాల వద్ద ,వాహనాల వద్ద ఎప్పటికప్పుడు తనిఖీలు ఉంటాయన్నారు. ప్రతి మనిషిని ప్రతి వాహనాన్ని వదిలిపెట్టకుండా తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీకృష్ణ, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహరాజు, ఒంటిమిట్ట సిద్ధవటం సబ్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాసులు ,హారిక, ఆలయ డిప్యూటీవో ప్రశాంతి, శివ ప్రసాద్, సత్యనారాయణ ,మనోహరం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

